'కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి'

వనస్థలిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పాదయాత్ర చేపట్టి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

'శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా చూడాలి'

వనస్థలిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా చూడాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టుకాలనీలో శానిటేషన్ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం అందించారు. బుధవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ మార్నింగ్‌వాక్ చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జవాన్ యాదయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు వరకు సీసీ రోడ్డు నిర్మించండి

హయత్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని సత్యనారాయణకాలనీ మైనారిటీ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మీర్ హాదిఅలీ బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసి సీసీ రోడ్డు వేయాలని కోరారు. ప్రధాన రోడ్డు నుంచి మసీదు వరకు మట్టి రోడ్డు ఉండడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. నమాజ్‌కు వచ్చే వారికి కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మసీద్ వరకు రోడ్డు నిర్మించాలని కోరారు.



ట్రంకులైను పనులకు శంకుస్థాపన చేస్తున్న 22వ వార్డు కౌన్సిలర్ ఐలయ్య

ట్రంకు లైన్ పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు కమ్మగూడ శివాలయం లక్ష్మీప్రియనగర్‌కాలనీలో రూ. 1కోటితో చేపట్టనున్న ట్రంకు లైను పనులకు బుధవారం స్థానిక కౌన్సిలర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా 22వ వార్డులో ట్రంకులైను పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ట్రంకులైను లేకపోవడం వల్ల రాజ్‌రంజిత్, నవభారత్‌కాలనీ, ప్రగతినగర్‌కాలనీ, సాయిప్రియనగర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఇందిరమ్మకాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఉండేవని తెలిపారు. ట్రంకు లైను పనులు పూర్తి కాగానే సీసీ రోడ్లు వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, వెంకటేష్‌యాదవ్, రాజునాయక్, రాగ్యానాయక్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



డెల్ టెక్నాలజీ అందజేసిన సైకిళ్లతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): డెల్ టెక్నాలజీ సహకారంతో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు 15 సైకిళ్లు, 15 బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. కొన్ని రోజుల క్రితం లెర్నింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దాంట్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 15మంది విద్యార్థులను హైటెక్ సిటీలోని డెల్ టెక్నాలజీకి తీసుకెళ్లారు. అక్కడ వారికి సెల్ఫ్ డిఫెన్స్, కరాటే వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సైకిళ్లను అందజేయస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకటించారు. దాంతో బుధవారం 8,9వ తరగతికి చెందిన 15మంది విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులను ప్రతినిధులు అందజేశారు. టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తమ సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడదాం'

మన్సూరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు బాలల హక్కులను అమలు చేస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్‌ను బుధవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసేవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

ఎల్బీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్కేపురం డివిజన్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బీబీఆర్ వేణు, గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో పురోగతి సాధిస్తున్నదన్నారు. ప్రజలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, బుక్క రమేష్, ముంత రాములు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్, సైదయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ 'ఎస్‌టీఎఫ్' తనిఖీలు

- **4.36 కిలోల గంజాయి స్వాధీనం**
- **ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్**



గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందం పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఒడిశా నుంచి నగరానికి వచ్చి గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.36 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

సరూర్‌నగర్‌లో..

సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ టీమ్ ఎస్‌ఐ బాలరాజు బృందం బాలాపూర్ మండలం, మల్లాపూర్ గ్రామంలో తనిఖీ చేసింది. ఒడిశాకు చెందిన కూన సేవ్ అనే వ్యక్తి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో గంజాయి తీసుకొచ్చి అమ్మకందార్లకు ఇచ్చి వెళ్తున్నట్లు గుర్తించి అతడిని పట్టుకున్నారు. 1.53 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మియాపూర్ ప్రాంతంలో గంజాయి నిల్వ చేశారనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ టీమ్ సీఐ సుబాష్‌చందార్‌రావు సిబ్బందితో తనిఖీ చేశారు. అసోం ప్రాంతం నుంచి వచ్చి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న భరత్ భూయ్యా అనే వ్యక్తి ఇంట్లో 1.23 కేజీల గంజాయి లభించింది. అతడు పనిచేస్తున్న ప్రాంతాల్లో పెంచుతున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మల్కాజిగిరిలో..

మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేరేడ్‌మెట్ ప్రాంతంలో ఎస్‌టీఎఫ్ సీఐ బాలరాజు బృందం ఓ ఇంట్లో తనిఖీ చేయగా 1.60 కిలోల గంజాయి లభించింది. ఓ స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఫహిమా బేగంను అరెస్ట్ చేశారు. షానవాజ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. కేసును మల్కాజిగిరి స్టేషన్‌కు అప్పగించారు.



కోదండరామ్‌నగర్‌లో సర్వే వివరాలు నమోదు చేస్తున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్



బడంగ్‌పేట్‌లో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, పాల్గొన్న కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు



హౌస్‌లిస్టింగ్ స్టిక్కర్‌ను అంటిస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఉపకమిషనర్ సేవా ఇస్లావత్

ఇంటింటి సర్వేలో తొలిరోజు
ఇళ్లకు స్టిక్కర్

- **8వ తేదీ వరకు ఇళ్ల జాబితా తయారీ**
- **9నుంచి 18వ తేదీ వరకు ఇంటింటా వివరాల సేకరణ**

జోన్‌బృందం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన కులగణన సర్వే బుధవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో ప్రారంభమైంది. సర్వేలో మొదట ఇళ్ల జాబితా(హౌస్‌లిస్టింగ్) రూపొందించి ఆయా ఇళ్లకు స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ ప్రక్రియలో అధికారులు మొదట ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించి ఆ కుంటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం నిర్ణీత ఫారంలో నమోదు చేసి హౌస్‌లిస్టింగ్ అయిన తర్వాత వివరాలు నింపిన స్టిక్కర్లను ఇంటి గోడపై అతికిస్తున్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి యజమానుల ద్వారా పూర్తి వివరాలు సేకరించి సర్వే ఫారాలలో నమోదు చేయనున్నారు. ఆ ప్రక్రియ 9 నుంచి 18వ తేదీ వరకు పది రోజుల్లో సేకరించి సర్వే పూర్తి చేయనున్నారు.

గడ్డిఅన్నారం, చైతన్యపురి డివిజన్‌ల పరిధిలోని కాలనీలలో జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో సిబ్బంది వివరాలు సేకరించారు. తూర్పుజోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డిలు అధికారులతో కలిసి కోదండరాంనగర్, సీసలబస్తీ కాలనీలలో సర్వేలో పాల్గొని, నివాసితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మీర్‌పేట్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న మేయర్ దుర్గ, కమిషనర్ జ్ఞానేశ్వర్



హౌస్‌లిస్టింగ్‌కు వివరాలు అందజేస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత

మన్సూరాబాద్, నాగోల్ డివిజన్లలో..

మన్సూరాబాద్, నాగోల్ డివిజన్లలో అధికారులు బుధవారం కుల గణన సర్వే చేపట్టగా ఇందులో 31 మందికి పైగా సూపర్‌వైజర్లు, 308 మందికి పైగా ఎన్యుమరేటర్లు ఉన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన సర్వేలో 16 మంది సూపర్‌వైజర్లు, 156 మంది ఎన్యుమరేటర్లు, అదేవిధంగా నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన సర్వేలో 15మంది సూపర్‌వైజర్లు, 152 మందికి పైగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరికి కుల గణన స్టిక్కర్లను అతికించారు.

సర్వేకు సహకరించాలి : జడ్సీ

కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, కార్పొరేటర్ సుజాతానాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని తుల్జాభవానీనగర్ కాలనీలో బుధవారం కులగణన సర్వేను జడ్సీ, కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ సేవ ఇస్లావత్ పరిశీలించారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో..

బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం కులగణన సర్వే ప్రారంభమైంది. ఆయా కార్పొరేషన్ల మేయర్లు ఎం.దుర్గాదీప్‌లాల్, చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కమిషనర్లు ఆర్.జ్ఞానేశ్వర్, పి.సరస్వతి పాల్గొని సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ఫారమ్‌లో నమోదు చేయించారు.



ద్వారకామాయినగర్‌లో సర్వే నిర్వహిస్తున్న డీసీ తిప్పర్తి యాదయ్య



కుటుంబీకులకు సమగ్ర కుటుంబ సర్వే పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, నోడల్ ఆఫీసర్ మురళీమోహన్ తదితరులు



తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో స్టిక్కరింగ్ పనులను పరిశీలిస్తున్న అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి



అనాజ్‌పూర్‌లో ఇంటింటి సర్వేలో పాల్గొన్న ప్రత్యేక అధికారి శ్రీలత, ఎంఎస్‌వో నాగలక్ష్మి, ఎంపీడీవో శ్రీవాణి తదితరులు



అధికారులకు వివరాలు అందజేస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, చిత్రంలో డీసీ సుజాత



చంపాపేట డివిజన్ మాధవనగర్‌కాలనీలో నిర్వహించిన కులగణన సర్వేలో కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, డీసీ సేవ ఇస్లావత్

తులం బంగారం వెంటనే ఇవ్వాలి : ఎమ్మెల్యే సబిత

ఎల్బీనగర్ : వంద రోజుల్లో హామీలు అమలు చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించి మోసం చేశాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఇస్తానన్న లక్ష రూపాయలతో పాటు తులం బంగారం వెంటనే ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండలం పరిధిలోని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం మండల కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డితో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. అనంతరం సరూర్‌నగర్ కళాశాల నూతన భవనాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, రాంనర్సింహగౌడ్, సాజిద్, పెంబర్తి శ్రీనివాస్‌రావు, కంచర్ల శేఖర్, రుషి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి

అభివృద్ధి పేరిట మరో సమస్య తెచ్చిపెట్టడం సరికాదు

మన్సూరాబాద్: రోడ్డు అభివృద్ధి పేరిట రోడ్లు తవ్వి డ్రైనేజీ వ్యవస్థను ధ్వంసం చేసి మరో సమస్య తెచ్చిపెట్టడం సరికాదని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని గణేశ్‌నగర్‌కాలనీ ఫేజ్-1లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన పర్యటించారు. విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పేరిట రోడ్లను తవ్వడంతో డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమవడంతో పాటు మంచినీటి పైప్‌లైన్‌లో కలిసి తాగునీరు కలుషితమైన తీరును కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా సమస్య తలెత్తిందని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసర కాలనీల రోడ్లకు జాతీయ రహదారి అనుసంధానంగా ఉందని, దీంతో కాలనీ రోడ్లు సైతం ధ్వంసమై నివాసితులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకుంటే కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతామని అధికారులను ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, సతీష్‌చంద్, సుధాకర్, రమేష్, మురళీధర్, ఘనాచారి, రఘుపతి, శ్రీధర్‌రెడ్డి, అప్పల రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా పెంటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన పంది పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్ బుధవారం పెంటయ్యకు నియామకపత్రం అందజేశారు. పెంటయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

చంపాపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బాలాపూర్ మండలం గుర్రంగూడ ఎస్వీ కాలనీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఏ.అమర్‌నాథ్(56) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్బీలో విధులు నిర్వహిస్తున్న అమర్‌నాథ్‌ను 2019 అక్టోబరు 25న కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు ఉన్నతధికారులు అటాచ్ చేశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఎల్బీనగర్‌లోని ఓ రియాబిలేషన్ సెంటర్‌లో ఆయన డయాలసిస్ చేయించుకుంటున్నారు. బుధవారం ఉదయం ఆయన మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బంది సంతాపం తెలిపారు. ప్రభుత్వ పరంగా దహన సంస్కారాల కోసం మృతుడి కుటుంబానికి రూ.20వేలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లింగరాజు, పద్మయ్య, ఏఎస్‌ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



సంధ్యారాణి

హయత్‌నగర్ : యువతి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ రాజీవ్ గృహకల్పలో వీరమణి ఆమె కూతురు సంధ్యారాణి(23) నివాసం ఉంటున్నారు. సంధ్యారాణి రామంతాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. బుధవారం ఉదయం 6గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాలేదు. తెలిసిన బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో తల్లి వీరమణి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ పట్ల జాగ్రత్త వహించాలి

- **ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య**



ఏసీపీ కృష్ణయ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సాగర్

మన్సూరాబాద్ : నేటి సమాజం, ముఖ్యంగా విద్యార్థులు, యువత సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ పట్ల జాగ్రత్త వహించడంతో పాటు అవగాహన కలిగి ఉండాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. సైబర్ జాగృత్ దివస్ కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఏ.సూర్యనాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో సైబర్ నేరాలు పెరుగుతున్నందున దీనిని కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ యాంటీ నార్కోటిక్ బ్యూరోలను ఏర్పాటు చేసిందన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలు, యాప్‌ల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వాటి వద్దకు వెళ్లకుండా విద్యార్థులు తమ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలని, లేదంటే సీవైబీఈఆర్‌సీఆర్ఐఎంఈ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. అనంతరం ఏసీపీ కృష్ణయ్య ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్‌లను కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ శాలువాతో సన్మానించారు. అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐలు రమేష్, శివనాగప్రసాద్, కానిస్టేబుళ్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కులగణన సర్వేలో 'కుమ్మర'గా నమోదు చేయించాలి'

చంపాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో భాగంగా ఇంటింటికీ వచ్చే అధికారులకు వివరాలు అందించేటప్పుడు కుమ్మరులు తమ కులంను కుమ్మరగా నమోదు చేయించుకోవాలని కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో బుధవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కుమ్మరులు తమ కులంను కుమ్మరగా నమోదు చేయించుకోవాలని వారు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే సర్వేలో కుమ్మర కుల జనాభా ఎంత ఉంటుందో తెలుస్తుందన్నారు. అధికారులకు సంపూర్ణంగా వివరాలు అందించాలని ఆయన రాష్ట్రంలోని కుమ్మరలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల కుమ్మర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'పంచదాయలను విశ్వబ్రాహ్మణులుగా పరిగణించాలి'

మన్సూరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో పంచదాయ వృత్తిదారులందరిని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్థులుగా పరిగణించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణులు డిమాండ్ చేశారు. బీసీ కుల గణనలో భాగంగా పంచదాయలను కులవృత్తులుగా చిత్రీకరిస్తూ, విభజిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ఎల్బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్, శ్రీకాంతాచారి, పూలే విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణకార, పంచదాయ వృత్తులు చేస్తున్న తమ సంఘీయులను వేర్వేరు కులాలుగా పరిగణించకుండా ఒకే కులస్థులుగా బీసీ కులగణనలో పొందుపర్చాలని కోరారు. ఈ నిరసనలో సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వతం శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి ఆందోజు శ్రీనివాసాచారి, రామాచారి, పోలోజు రమేష్‌చారి, నారోజు జగ్జీవన్‌చారి, ఆందోజు సత్యంచారి, పులిగిల్ల శ్రీనివాసాచారి, పెద్దకొలిమి బ్రహ్మచారి, రాపల్లి కృష్ణమాచారి పాల్గొన్నారు.

తట్టిఅన్నారంలో సదర్ సమ్మేళనం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలో రాధాకృష్ణయాదవ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతును అందంగా ముస్తాబు చేసి దానితో విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమానికి గొర్రెల, మేకల పెంపకందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలరాజుయాదవ్‌తో పాటు కౌన్సిలర్ గీతావేణుగోపాల్‌రెడ్డి, జంగయ్యయాదవ్, అల్లాజీయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

మైనర్‌ను ప్రేమపేరుతో వేధించిన నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

హైదరాబాద్ సిటీ : చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మైనర్‌ను ప్రేమ పేరుతో వేధించి, వెంబడించి అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన నిందితుడు శనిమల్ల అఖిల్‌కు న్యాయస్థానం 3 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అబ్దుల్లాపూర్‌మెట్ అయ్యప్ప కాలనీకి చెందిన శనిమల్ల అఖిల్(21) ఓ మైనర్‌ను ప్రేమ పేరుతో వేధించాడు. అంతే కాకుండా బాలికను వెంబడించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడిని ఎల్బీనగర్‌లోని ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో హాజరుపరచగా, నిందితుడికి మూడేళ్ల జైలుతోపాటు రూ.11వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు.

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

- **ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది**



పవన్‌కుమార్‌తో వైద్యులు

హైదరాబాద్ సిటీ: ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎన్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ. పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని అపోలో ఆస్పత్రి వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నాను. త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు పాల్గొన్నారు.